కథ

# విష్ణుమాయ

స్వర్ణలతా రెడ్డి



''లలితా కాఫీ'' గావుకేక పెట్టాడు సుందరం. వాలుకుర్చీలో కాళ్లు బార్లా చాపుకుని ఓ చేత్తో పేపర్, మరో చేత్తో సిగరెట్ పట్టుకొని, పొద్దుటి నుంచి నాలుగో కప్పు కాఫీ అడిగేసరికి లలితకి ఒళ్లు మండిపోయింది.

''ఆ దిక్కుమాలిన వీఆర్ఎస్ తీసుకోకండి అంటే విన్నారు కాదు. మీరు ఆఫీసుకి వెళుతుంటే కనీసం మధ్యాహ్నమైనా కాస్త ఇరుగు పొరుగుతో మాటా మంతి వుండేది. ఇప్పుడు చూడండి ఇరవైనాలుగ్గంటలూ నాది కంచిగరుడసేవ అయిపోయింది. క్షణం తీరుబడి లేదు. దమ్మిడి ఆదాయం లేదు అన్నట్లుగా వుంది నా పని'' విసుక్కుంటూ కాఫీ తెచ్చి ఠక్కున సుందరం పక్కనున్న స్టూల్ పైన పెట్టింది.

''ఛ! నువ్వేం భారతనారివే నేనేమన్నా ఇనుప గుగ్గిళ్లు వండి పెట్టమన్నానా? సూర్యుడు ఉదయించకుండా ఆపమన్నానా? అడిగింది కాస్త కాఫీ... అది కూడా నేను సంపాదించి పెట్టిన డబ్బుతో....తయారు చేసి దానికి ఇంత లెక్చరా... ఛా..ఛా..ఛా... రాను రాను భారతీయ సంస్కృతి క్షీణిస్తోంది.'' అంతకంటే ఎక్కువ విసుగ్గా కాఫీ కప్పు అందుకున్నాడు సుందరం.

భర్త మాటకు ఘాటుగా జవాబు ఇద్దామని అనుకుంటుండగా...పక్కింటి శారద 'లలితా లలితా' అంటూ పిలవడం వినిపించి మీ సంగతి తరువాత తేలుస్తానన్నట్లుగా సుందరం వైపు ఓ చూపు విసిరి... ఆం.. ఆ..వస్తున్నా...అంటూ పెరట్లోకి వెళ్లింది.

''ఏమిటి,పనిలో వున్నావా? ఏం లేదు... మా పై పోర్షన్‌లో వున్న రాధ నిన్న ఏదో స్పోకెన్ ఇంగ్లీషు కోర్సులో చేరిందట. మనం కూడా వెళ్లి చూసొద్దామా బాగుంటే జాయిన్ అవ్వొచ్చు.''

''ఇప్పుడు మనం ఇంగ్లీషు మాట్లాడకపోతే, మునిగిపోయేదేముంది లేద్దూ...అయినా ఈయన నౌకరు చాలు, నాకు రోజంతా పని కల్పించడానికి, వేరే కాలక్షేపం అవసరం లేదు'' అంది లలిత విసుగ్గా.

''నువ్వో తిక్క మొహానివి, నేను చెప్పేదీ అదే, మా ఆయన తీసుకున్నారుగా వీఆర్ఎస్. ఇదివరకు నాకు వంట గంటలో అయిపోయేది. ఇప్పుడు ఈయన వంటింట్లో చేరి అన్నిట్లో వేలు పెడుతూ, చేసిన ప్రతి పనికీ వంకలు పెడుతున్నారు. మునక్కాడలకి, బీరకాయలకి పైన పొట్టు మొత్తం తీసెయ్యకూడదు. విటమిన్లు పోతాయి. ఆకుకూరలు ముందు కడిగి తరువాత తరగాలి. కూరగాయల ముక్కలను వీలయినంత పెద్దవిగా కోసి, తక్కువ సెగ మీద వుడికించాలి. చిక్కుడుకాయలు, క్యాబేజీ, ఉడికించిన నీళ్లు పారబోయకుండా పులుసులో వేసుకోవాలి... ఇలా నానారకాలుగా నన్ను హింసిస్తున్నారు. ఈ వయసులో మనకి ఉద్యోగం ఎలాగూ దొరకదు. ఏదో ఒక పని కల్పించుకొని మనమే బయటపడాలి'' అంది రహస్యం చెబుతున్నట్లుగా.

''నిజమే సుమా... ఈ ఐడియా నాకు తట్టలేదు. అలాగే వెళదాంలే'' అంది లలిత. సాయంకాలం కమ్యూనిటీ హాలో భామాకలాపం ప్రదర్శిస్తున్నారని తెలిసి, అటు వెళ్లాడు సుందరం. దారిలో సుబ్బారావు కలిసాడు.

''ఏంటి సుబ్బారావు ఎట్లా వుంది రిటైర్‌మెంట్ లైఫ్'' క్షేమ సమాచారాలు అడిగాడు సుందరం.

''రిటైర్‌మెంటా... నా బొందా... ఇంట్లో నేను ఖాళీగా ఉన్నానని మా ఆవిడ నాకు వంటపని అప్పగించి తను చిన్నప్పుడు వర్ణాల దాకా నేర్చుకొని వదిలేసిన సంగీతం ఇప్పుడు కృతుల దాకా లాగి తీరుతానని పట్టుబట్టి సంగీతం క్లాసులో జాయిన్ అయింది. నా బతుకు వంటింటికి అంకితం అయిపోయింది. ఇదిగో ఇప్పుడే బెండకాయవేపుడు, కొబ్బరి చట్నీ, పులుసు చేసి అప్పడాలు, వడియాలు కూడా వేయించి ఇలా బయలుదేరాను'' అంటూ నిట్టూర్చాడు సుబ్బారావు.

''అయితే మా ఆవిడే నయమన్నమాట. వంట ముగించుకొని వెళతోంది ఇంగ్లీషు క్లాసుకి'' అనుకుని మనసులోనే సంతోషపడ్డాడు సుందరం.

ఇంతలో కృష్ణప్రసాద్ కమ్యూనిటీహాల్ నుంచి వస్తూ కనిపించాడు.


'ప్రసాద్..ప్రసాద్' చప్పట్లు కొట్టి పిలిచాడు సుందరం.

''ఏం... వెళ్లిపోతున్నావు. ప్రోగ్రాం బాగాలేదా...!'' అడిగాడు సుబ్బారావు.

''ఏం ప్రోగ్రామో... ఏమో...డాన్స్ మీద ఇంట్రెస్ట్ వుండి చస్తే కదా... ఏదో మా ఆవిడ పోరు తప్పించుకుందామని ఇట్లా బయలుదేరాను. లోపల మీరెవరూ కనపడక పోయేసరికి సిగరెట్ కాలుద్దామని బయటకు వచ్చాను'' అన్నాడు ప్రసాద్ సిగరెట్ తీసి వెలిగిస్తూ.

''అదేంటి.... మీ ఆవిడా నువ్వు చాలా సఖ్యతగా వుంటారు. అప్పుడెప్పుడో మన క్లబ్‌లో 'మేడ్ ఫర్ ఈచ్ అదర్'గా బహుమతి కూడా వచ్చింది'' అంటూ ఆశ్చర్యపోయాడు సుందరం.

''అదంతా గత వైభవం...ప్రస్తుత పరిస్థితి, తేరే వేరు. ఉద్యోగానికి వెళ్లే రోజులేనయం. ఆఫీసులో అలసి,సొలసి ఇంటికి వస్తున్నామని ఇంట్లో మా రాధ నాకు ఒక్క పనికూడా చెప్పేది కాదు. పొద్దున పదిగంటలకు దర్జాగా భోజనం చేసి కిళ్లీ వేసుకొని మగమహారాజులా పదకొండు గంటలకి ఆఫీస్‌కి వెళ్లేవాళ్లమా? అక్కడ అరగంట సీట్లో కూచోగానే ఏ క్లయింటో, ఫ్రెండో వచ్చి చాయ్ తాగడానికి క్యాంటీన్‌కి తీసుకెళ్లేవాడు. టీ ముగించి సీట్లో కాసేపు కూచోగానే బాస్ కొట్టే గ్యాస్ గురించో, గుర్నాథం చేస్తున్న చిట్స్ బిజినెస్ గురించో, పక్కసీటు పంకజం పెంచుకుంటున్న కుక్కపిల్ల గురించో కాసేపు ముచ్చటించుకునేసరికి లంచ్ టైం మళ్లీ క్యాంటీన్ టిఫిన్, టీ,పాన్.... ఆ తరువాత ఓపికుంటే కాసేపు ఫైల్స్ చూడ్డం లేదా నిద్రపోవడం... మూడు గంటలకి మళ్లీ టీ...గడియారం ఐదు కొట్టగానే ఠంచనుగా లేవడం, ఇంటికెళ్లి పొద్దున్నుంచి ఉద్యోగం చేసి అలసిపోయి వచ్చిన భర్తకు ఎలా సపర్యలు చేయాలో గుర్తుచేయడం, ఒక వేళ మరిచిపోతే పిల్లలకి వాళ్లంతా ఎంత అదృష్టవంతులో ఆ వయ



''నువ్వో తిక్క మొహానివి, నేను చెప్పేదీ అదే, మా ఆయన తీసుకున్నారుగా వీఆర్ఎస్. ఇదివరకు నాకు వంట గంటలో అయిపోయేది. ఇప్పుడు ఈయన వంటింట్లో చేరి అన్నిట్లో వేలు పెడుతూ, చేసిన ప్రతి పనికీ వంకలు పెడుతున్నారు. మునక్కాడలకి, బీరకాయలకి పైన పొట్టు మొత్తం తీసెయ్యకూడదు. విటమిన్లు పోతాయి.



సులో మనం ఎన్ని కష్టాలుపడ్డామో ఓ లెక్చర్ ఇవ్వడం, శుభ్రంగా తిని పడుకోవడం. ఏం వైభవం రా అది! మహా గొప్ప రోజులు.''

ఇప్పుడు చూడు, పొద్దున లేచినప్పటి నుంచి ఏమండీ, కొంచెం పాలపాకెట్ తెచ్చిపెట్టరూ. ఆ పేపర్ వాడు మొన్న పేపర్ నీళ్లలో పడేసి వెళ్లాడు. వాడి సంగతేమిటో కనుక్కోండి... ప్లీజ్ కొంచెం కూరగాయలు తెచ్చిపెట్టండి...వంకాయలు, నల్లగా నిగనిగలాడుతూ వుండాలి.బెండకాయలు చివర తుంపితే ఫట్‌మని విరగాలి. కొంచెం గ్రైండర్ బాగుచేసి పెట్టండి. మొన్ననే రెండువందలిచ్చి రిపేరు చేయించామా. మళ్లీ దీనికేం మాయ రోగం మొచ్చిందో.... పెద్దవాడి దగ్గరనుంచి ఫోన్ వచ్చి వారం దాటిపోయింది. బయటకెళ్లి 'ఈ-మెయిల్' ఇచ్చిరండి... చిన్నవాడి 'ఫైనల్ ఇయర్' అయిపోవచ్చింది. వెళ్లి ఆ 'టోఫెల్, జీఆర్ఈ' అంటూ ఏవో ఎగ్జామ్స్ వున్నాయి కదా వాటి గురించి 'ఎంక్వయిరీ' చేసిరండి. ఇలా అనంతంగా వుంటాయి ఆర్డర్స్ ఏమన్నా అంటే, నేను ఇంటిపనితో, వంటపనిలో ఎంత బిజీగా వున్నానో చూస్తున్నారుగా, మీరు ఖాళీగానే వున్నారు. కాస్తా సాయం చేస్తే తప్పా ఇలా రాచి రంపాన పెడుతోందిరా నా భార్య'' భోరుమన్నాడు ప్రసాద్. ''అయితే అందరూ ఒకే పడవలో ప్రయాణిస్తున్నామన్నమాట పదండి అలా చాయ్ తాగుతూ మాట్లాడుకుందాం'' అంటూ క్యాంటిన్ వైపు దారి తీసాడు సుందరం.

చాయ్ మీద చాయ్ తాగేస్తూ సిగరెట్ మీద సిగరెట్ ఊదేస్తూ సుదీర్ఘమైన చర్చల అనంతరం, భోజనాల టైంకి అందరూ ఇళ్లకు బయలుదేరారు.

భోజనాలయ్యాక బెడ్‌రూంలో తాను ప్రత్యేకంగా కట్టించుకొచ్చిన కిళ్లీ ఒకటి తాను నములుతూ మరోటి ప్రేమగా భార్యకు అందించాడు సుందరం ఓరగా చూస్తూ ''ఇదిగో లలితా, ఇలా చూడు ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి. తలుపు ఘడియ పెట్టి ఇలా రా'' అన్నాడు.

''తలుపుకి గెడపెట్టి మాట్లాడుకోవలసిన మాటలు ఇంకా ఏమున్నాయి మన మధ్య''అంది లలిత కాస్త చిరాగ్గా.

''ఛా..అది కాదు. ఇందాక కమ్యూనిటిహాల్‌కి వెళ్లానా, అక్కడ నా పాత స్నేహితుడు అప్పారావు కనిపించాడు.''

''ఈ అప్పారావెవడు, కొంపదీసి అప్పు అడగలేదు కదా! లేదని చెప్పారా లేక మీ మామూలు ధోరణిలో 'అలాగే చూద్దాంలే రేపురా' అని మాటిచ్చారా''అంది లలిత గాభరాగా

''అబ్బా అది కాదే. అతను ఒక బ్రహ్మాండమైన ప్రపోజల్ ఇచ్చాడు. మియాపూర్ నుంచి జీడిమెట్లకు వెళ్లే దారిలో వజీర్‌సుల్తాన్ అనే ఆయనకి మూడు ఎకరాల స్థలం వుందంట. ఆ వజీరు మన అప్పారావు బాల్యమిత్రులులే. ఈ మధ్య ఆ భూమిని కొనడానికి ఒక బొంబాయి పార్టీ వచ్చిందట. ఆ భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు అన్నీ వజీరు దగ్గర వున్నాయట. కాకపోతే వజీరు వాళ్ల నాన్నకి నలుగురు భార్యలట. ముగ్గురు తాలూకూ పిల్లలందరూ సంతకాలు చేసేశారట. ఒక్క నాల్గవ సంతానం లతీఫ్ మాత్రం గొడవ పెడుతున్నాడట. అసలు ఆనాలుగో భార్య తబస్సుమ్‌కు వజీరు వాళ్ల నాన్న ఎప్పుడో తలాక్ ఇచ్చేశాడట. ఈ ఆస్తి ఆవిడకు తలాక్ ఇచ్చాక సంపాదించిందట. అందుకని ఇందులో లతీఫ్‌కు ఎటువంటి హక్కు లేదట. ఇది రుజువు చెయ్యడానికి కావాల్సిన పేపర్లు కూడా వజీర్‌భాయ్ దగ్గరవున్నాయట. ఇటువంటి కేసులు కోర్టులో వేస్తే పదేళ్లయినా, ఇరవై ఏళ్లయినా ఏదీ

''ఇదిగో లలితా,
ఇలా చూడు ఒక
ముఖ్యమైన విషయం
మాట్లాడాలి. తలుపు
గడియ పెట్టి
ఇలా రా'' అన్నాడు.
''తలుపుకి గెడపెట్టి
మాట్లాడుకోవలసిన
మాటలు ఇంకా
ఏమున్నాయి మన మధ్య''
అంది లలిత కాస్త
చిరాగ్గా.



## స్నేహ వాచీల సరదా

'రామదాసు' భార్యగా మరచిపోలేని అందాలు, ఆనందాలు ప్రదర్శించిన స్నేహకి వాచీల సేకరణంటే భలే ఇష్టం. షూటింగ్ పరంగానే కాదు, సరదాగా ఎక్కడికి వెళ్ళినా వాచీల కోసం తెగ ఆరాట పడుతుంది స్నేహ. చేతి వాచీలు, గోడ గడియారాలే కాదు, టేబుల్ క్లాక్స్‌ను కూడా కొత్త కొత్తవి కొని సేకరించడం స్నేహకి బాగా అలవాటు. ఇప్పటికి చాలా వాచీలు కొనుగోలు చేసిందట తను. ఇంటి నిండా ఎక్కడ చూసినా వాచీలే వాచీలు. 'ఎందుకీ సరదా? సేకరణ?' అనడిగితే ' ఏం చెప్పమంటారు? అదో హాబీ అయిపోయింది. అంతే కాదు, టైమ్ మేనేజ్‌మెంట్ పట్ల కూడా నాకు ఎక్కడ లేని మక్కువ' అని నవ్వేసింది. ఏదయితేనేం ఆడావాళ్ళందరిలా నగలు, చీరలంటూ కాకుండా వాచీల మీద స్నేహ మోజు పెంచుకోవడం వెరైటీగానే ఉంది.

తెమలదట. అందుకని నేను మినిస్టర్‌గారితో మాట్లాడి ఎలాగైనా ఈ విషయం సెటిల్ చేస్తే నాకు 'వన్ పర్సంట్' అంటే ఎంత లేదన్నా నలభై లక్షలు ఇస్తారట'' అన్నాడు గుసగుసగా.

''బాగానే వుంది...మీకున్న పరపతికి, మా చిన్నాన్నగారి అబ్బాయికి తిరుపతి నుంచి కాళహస్తికి ట్రాన్స్‌ఫర్ చేయించలేకపోయారు. ఆ మినిస్టరెవడో మీ మాట ఎందుకు వింటాడు?'' అంది ఈసడింపుగా లలిత.

''మరీ అంతగా తీసిపారెయ్యకు లలితా. అదేదో మీ వాళ్ల దురదృష్టం. అందుకే కుదరలేదు. ముప్ఫయి ఏళ్లుగా సెక్రటేరియట్‌లో పనిచేసిన వాడిని నిన్నగాక మొన్న వీఆర్ఎస్ తీసుకుంటే మాత్రం నాకు ఆ మాత్రం పలుకుబడి లేదనుకుంటున్నావా? అవసరమయితే వాడికీ వీడికి కాస్త చేయి తడిపి అయినా సరే ఈ సెటిల్‌మెంట్ చేసి తీరుతాను''అన్నాడు సుందరం ధీమాగా.

''అలాగే లెండి మీ ములకుట్ల వారి సోంబేరితనాన్ని వదిలి ఇదయినా కాస్త తెలివిగా చెయ్యండి'' అంది లలిత.

''ఇదిగో నన్నేమయినా అంటే పడతాను గానీ మా వంశాన్ని అంటే ఊరుకోను. రేపటి నుంచి చూడు పొద్దుటే లేచి తయారయిపోయి, ఆఫీసుకి ఎంత ఠంచనుగా వెళ్లేవాడినో అంత ఠంచనుగా వెళతాను. వెళ్లి రోజుకి ఎనిమిది గంటలయినాసరే, పది గంటలయినా సరే కష్టపడి ఈ వ్యవహారమేదో సెటిల్ చేసి నీకు రవ్వల నెక్లెస్ కొనకపోతే చూడు'' వగరుస్తూ ప్రతిజ్ఞ చేశాడు సుందరం.

చాల్లేండి సంబడం అన్నదే గాని లలిత కళ్లు డైమండ్లలా మెరవడం సుందరం కనిపెట్టాడు. ''ఇదిగో ఈ విషయం మాత్రం ఎవరి చెవినా పడకూడదు సుమా! మూడో మనిషికి తెలిసిందంటే అందరూ ఎవరికి వాళ్లే అప్పారావుగాడిని వెదికి పట్టుకొని ఆ సెటిల్‌మెంటేదో మేమే చేయిస్తాం మాకు వన్‌పర్సెంట్ అక్కరలేదు. సగం ఇవ్వండి చాలు అని వాడి వెంట పడడం ఖాయం జాగ్రత్త!'' అన్నాడు.



''ఛా..ఛా...నేనేం అంత తెలివితక్కువ దాన్ని కాదులెండి. చచ్చినా ఎవ్వరికీ చెప్పను. ముందు మీరు ఎక్కడా నోరు జారకండి. మీ ములుకుట్ల వాళ్లకు అసలే ఓటు నోర్లు'' అంది లలిత.

తెల్లవారిందగ్గర్నుండీ లలిత సుందరానికి ఏలోటూ లేకుండా అన్నీ భయభక్తులతో అమర్చిపెట్టి, 'మీకు బయట తిండిపడదు. ఏ టైంకి వస్తారో ఏమో' అంటూ టిఫిన్ బాక్స్ కూడా ఇచ్చి 'క్షేమంగా వెళ్లి లాభంగా రండి' అంటూ సాగనంపింది.

సుందరం, సుబ్బారావు, కృష్ణప్రసాద్, దామోదరం నలుగురూ ఇందిరాపార్కులో ఓ మూల కూర్చొని పేక ముక్కలు తీశారు. ''భలే ఐడియా ఇచ్చావురా సుందరం. ఈ దెబ్బతో ఓ ఆరునెలలు హాయిగా గడపొచ్చు. అప్పటికి మరో ఐడియా తట్టకపోదు. ఈ లోగా మన ఉత్తమార్థాలు తమ వంటింటి పరిపాలన చేసుకుంటూ మన జోలికి రారు.'' అంటూ ఫెళ్లున నవ్వారు.

ఆ నవ్వుకి వైకుంఠంలో శేషశయ్యపై పవళించిన విష్ణుమూర్తి ఉలికిపడ్డట్లుగా కళ్లు తెరిచి పాదాలు వత్తుతూ కూర్చున్న లక్ష్మితో, ''ఎంతయినా పురుషులు, పురుషులే సుమా''అన్నాడు చిద్విలాసంగా నవ్వుతూ.

''ఆ సంగతి నాకు మాత్రం తెలియదా పురుషోత్తమా'' అంటూ ఓ నిట్టూర్పు విడిచి, మళ్లీ శ్రీవారి కాళ్లు నొక్కే పనిలో పడిపోయింది శ్రీమహాలక్ష్మి.

★

**చాల్లేండి సంబడం అన్నదేగాని లలిత కళ్లు డైమండ్లలా మెరవడం సుందరం కనిపెట్టాడు. ''ఇదిగో ఈ విషయం మాత్రం ఎవరి చెవినా పడకూడదు సుమా!**

# దర్శకత్వం చాలా ఇష్టం

'సుందర కాండ' సినిమాలో బాపు బొమ్మగా కనిపించనున్న చార్మికి, దర్శకత్వం చేపట్టాలని ఎప్పట్నించో కోరిగ్గా ఉందట! అవకాశం ఎవరిస్తారన్నది అటుంచితే ఇటీవల సుందర కాండ సినిమాలో నటించేటప్పుడు ఈ ముద్దుగుమ్మ బాపు గారి స్టోరీ బోర్డ్ చూసి 'ఆహా! స్టోరీ బోర్డ్ అంటే ఇది కదా!' అనుకుని, 'అవకాశం అంటూ వస్తే, దర్శకత్వం చెయ్యాలని ఎవరైనా పట్టుబడితే నేను కూడా స్టోరీ బోర్డ్ ఇలాగే రూపొందించుకుంటాను' అనుకుందట. బాపు గారిని అనుకరిస్తే ఇంకేం ఉంది? తప్పకుండా సక్సెస్ అవుతుంది. అనుమానం లేదు. బెస్ట్ ఆఫ్ లక్ చార్మి!!

